## మెడికల్ రిప్‌ల హక్కులను కాపాడాలి



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

మెడికల్ రిప్రజెంటేటివ్స్ హక్కులను కాపాడాలని బి.ఎం.ఎస్ ఆర్ ఏ రాష్ట్ర అధ్యక్షుడు పప్పుల సురేష్ తెలిపారు. భారతీయ మెడికల్ అండ్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి వద్దకు వినతి పత్రాలు సమర్పించామని తెలిపారు. బి.ఎం.ఎస్ ఆర్ ఏ కేంద్ర కమిటీ సూచించిన డిమాండ్‌లను అందులో వివరించారని చెప్పారు. ముఖ్యంగా, ప్రభుత్వ హాస్పిటల్‌లలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ నిషేధాన్ని కేంద్రం తక్షణమే వెనక్కి తీసుకోవాలని, 8 గంటల కచ్చితమైన పని విధానం అమలు చేయాలని, కేంద్రం ప్రకటించిన కనీస వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, ఫార్మా కంపెనీల ఆగడాలను నియంత్రించే చట్టపరమైన వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా నాయకులు క్యాతం శ్రీనివాస్, మాదాసు విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ విద్యార్థుల సమస్యలు పరిష్కారం



- మంత్రి పొన్నం, ఆర్టీఏ మెంబర్ రాహుల్ చొరవ

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ కొత్తపల్లి ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థుల సమస్యలు జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో పరిష్కరయ్యాయి. రాష్ట్ర యువ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ ఇటీవల కళాశాలను సందర్శించినప్పుడు విద్యార్థులు హాస్టల్ మెస్, రవాణా, భద్రత సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. విద్యార్థుల వినతులను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లిన రాహుల్, తక్షణమే స్పందన సాధించేందుకు కారణమయ్యాడు. ఫిర్యాదు ఆధారంగా హాస్టల్ మెస్ కాంట్రాక్టర్ ను మార్చి, ఆరోగ్యకరమైన భోజనం అందించేలా ఏర్పాటు చేశారు. అలాగే, కళాశాల వద్ద టీజీఎస్ ఆర్టీసీ రిక్వెస్ట్ బస్ స్టాప్ ఏర్పాటు చేసి, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ప్రధాన ద్వారం వద్ద భారీ కేట్లు ఏర్పాటు చేశారు. అదనంగా, హాస్టల్, అకాడమిక్ భవనం, గోడౌన్ ఆధునీకరణపై కూడా చర్యలు తీసుకోవాలని, బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ ను రాహుల్ కోరినట్టు తెలిపారు. త్వరలో విద్యార్థులతో కూడిన ప్రతినిధి బృందం మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలసి సమస్యల శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పంజాల కృపా సాగర్, ప్రధాన కార్యదర్శి జప శ్రవణ్ రెడ్డి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల ఉదయ్, ఎన్ఎస్ యూఐ నాయకుడు సుఫియాన్ తదితరులు పాల్గొన్నారు


## హుజూరాబాద్ ఏరియా హాస్పిటల్ తనిఖీ



**శెనార్తి మీడియా, హుజురాబాద్:**

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ఏరియా హాస్పిటల్‌ను జిల్లా డీసీహెచ్ఎస్ అధికారి డాక్టర్ కృష్ణ ప్రసాద్ పరిశీలించారు. ఆయనతో పాటు ఏవో మొహమ్మద్ నజీముల్లా ఖాన్, హాస్పిటల్ సూపరిండెంట్ నారాయణ రెడ్డి, సిబ్బంది ఉన్నారు. తనిఖీ సందర్భంగా డాక్టర్ కృష్ణ ప్రసాద్ ఆసుపత్రిలోని సదుపాయాలను సమీక్షించారు. వార్డులు, ఔషధాల లభ్యత, శానిటేషన్, ట్రీట్మెంట్ విధానాలపై పేషంట్లను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో వ్యాప్తి చెందుతున్న వ్యాధుల నివారణకు తీసుకుంటున్న చర్యలపై ఆసక్తి కనబరిచారు. ఆయన వెంట ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## ఇంటింటికీ వెళ్లి సీఎం రిలీఫ్ చెక్కులుఅందజేత



**శెనార్తి మీడియా, హుజురాబాద్:**

హుజురాబాద్ పట్టణంలో గురువారం నిర్వహించిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన స్వయంగా లబ్ధిదారుల ఇంటికే వెళ్లి మొత్తం రూ.8.35 లక్షల విలువైన చెక్కులను 29 కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా ఉండాలన్న భావంతో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తున్నాం. ప్రతి కుటుంబం పట్ల మా వంతు బాధ్యతను నిర్వర్తించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటాం" అని పేర్కొన్నారు. అలాగే ఇటీవల మరణించిన వారు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గందే శ్రీనివాస్, కౌన్సిలర్లు ముత్యం రాజు, తిరుమల్ రెడ్డి, యాదగిరి, కుమార్, కొండ్ర నరేష్, అనిల్, పూర్ణచందర్, కుమారస్వామి, తాళ్లపెల్లి శ్రీనివాస్, ఇమ్రాన్, రమా, కిషన్, ప్రతాప్ కృష్ణ, మోరె మధు పాల్గొన్నారు.

# నైరుతి ముఖం చాటేయడంతో ఆందోళన

## రాయలసీమలో వేరుశనగకు కష్టకాలం



విజయవాడ : మరోమారు ఖరీఫ్‌పై నైరుతి తీవ్ర ప్రభావం చూపింది. పలు జిల్లాల్లో ఇప్పటికీ చినుకు జాడ లేదు. దీంతో పంటలు ఆలస్యం కవాడంతో పాటు, పలు జిల్లాల్లో వేసిన విత్తనాలు వట్టిపోయే పరిస్థితి ఏర్పడిరది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ఎప్పటి కంటే కాస్తంత ముందుగా మే 26, 27 తేదీల్లో రాష్ట్రాన్ని పలకరించాయి. దీంతో వానలు పడతాయని, ఖరీఫ్ పంటల సాగుపై రైతుల్లో ఆశలు చిగురించాయి. అంతలోనే రుతుపవనాలు సుదీర్ఘకాలం ముఖంచాటేయడంతో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. తిరిగి వారం రోజులుగా రుతుపవనాల్లో కదలిక రావడంతోపాటు అల్పపీడనం, ఉపరితల ఆవర్తనాల వలన కొద్దిపాటి వానలు కురుస్తున్నాయి. కాగా రుతుపవనాల ఆగమనంతో సీజన్ మొదటి నెల జూన్లో సాధారణ వర్షం పడటం మామూలే. కానీ వర్షాలు పడకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు పెరగడంతో పంటలు వేసుకునే వారికి ప్రతికూల వాతావరణం ఏర్పడిరది. దీంతో ఎపిలో 8 జిల్లాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. తెలంగాణలోనూ ఉత్తర, దక్షిణ జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి ఏర్పడిరది. రాయలసీమలో వేరు శనగ రైతులు వానల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం అరకొరగా సబ్సిడీపై అందిస్తున్న విత్తనాల పంపిణీ మందకొడిగా సాగుతోంది. ఇతర మెట్ట పంటల సేద్యం సైతం నెమ్మదిగానే కొనసాగుతోంది.ఈ మారు ఖరీఫ్ ప్రారంభంలోనే రాష్ట్రాన్ని వర్షాభావం వెంటాడుతోంది. జూన్ మాసంలో ఎనిమిది జిల్లాల్లో సాధారణస్థాయి కంటే తక్కువ వర్షం నమోదైంది. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, దక్షిణాంధ్రలో పల్నాడు, నెల్లూరు, రాయలసీమలో అనంతపురం, కర్నూలు, నంద్యాల మినహా ఇతర జిల్లాల్లో వర్షాభావం నెలకొంది. ఆదిలోనే వర్షాభావం ఎదురుకావడంతో ఆయా ప్రాంతాల్లో పంటల సేద్యం దాదాపుగానిలిచిపోయింది. అల్లూరి, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కర్నూలు, నంద్యాల సగటు లెక్కల ప్రకారం వర్షాభావానికి దగ్గరగా ఉన్నాయి. రాష్ట్రంలో సగటున సాధారణ వర్షం కురిసినట్లు కనిపిస్తోంది. మొత్తం 26 జిల్లాలుండగా ఎనిమిది జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 54.69 శాతం తక్కువ వర్షం పడిరది. సాధారణం కంటే ఎక్కువ వర్షం తొమ్మిది జిల్లాల్లో కురిసింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో 70.72 శాతం ఎక్కువ వర్షం నమోదైంది. మిగతా తొమ్మిది జిల్లాల్లో సాధారణ స్థాయిలో వానలు పడ్డాయి. ఈ ఏడాది అనంతపురంలో సాధారణం కంటే ఎక్కువ వర్షం పడిరది. జూన్‌లో లో ఆ జిల్లాలో మామూలుగా 41.85 మిమీ వర్షం పడాల్సి ఉండగా 54.73 మీమీ పడింది.

## వ్యాక్సిన్‌లపై సిద్దరామయ్య వ్యాఖ్యలు అసత్యం

**వ్యాక్సిన్లు లక్షలమంది ప్రాణాలను నిలబెట్టాయి**

**బయోకాన్ చీఫ్ కిరణ్ మంజుదార్ షా**



**న్యూఢిల్లీ:** హసన్ జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న మరణాలకు కొవిడ్ టీకాల ప్రభావమే కారణం కావొచ్చని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వ్యక్తంచేసిన అనుమానాలను తాజాగా బయోకాన్ చీఫ్ కిరణ్ మంజుదార్ షా తోసిపుచ్చారు. సిద్ధరామయ్య వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. సిద్ధరామయ్య అనుమానాలను తోసిపుచ్చిన ఆమె.. సీఎం వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించేవిగా ఉన్నాయన్నారు. 'భారత్‌లో అభివృద్ధి చేసిన కొవిడ్‌-19 వ్యాక్సిన్‌లు అత్యవసర వినియోగ అధికార చట్టం కింద ఆమోదించడం జరిగింది. భద్రత, సమర్థత కోసం ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగానే ఇది తయారైంది. ఈ వ్యాక్సిన్‌లపై తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయొద్దని కూడా సూచించారు. ఇవి లక్షల మంది ప్రాణాలను కాపాడాయి. ప్రజలపై దుష్పరిణామాలు సంభవించిన కేసులు చాలా అరుదుగా చోటుచేసుకున్నాయి. ఈ వ్యాక్సిన్లపై నిందలు వేయడం మానేసి దాని అభివృద్ధి వెనక ఉన్న సైన్స్‌ను గుర్తించడం చాలా ముఖ్యం అని ఆమె తెలిపారు. ఇదిలాఉండగా.. యువత ఆకస్మిక మరణాలకు జీవనశైలి, ముందస్తు ఆరోగ్య సమస్యలే కారణం తప్ప, కొవిడ్ వ్యాక్సిన్ కాదని బుధవారం కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ స్పష్టంచేసింది. భారతీయ వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్), దిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన అధ్యయనాల్లో ఈ విషయం తేలిందని పేర్కొంది. దేశీయంగా తయారైన కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తున్నాయని, తీవ్ర దుష్పరిణామాలు సంభవించిన ఉదంతాలు అత్యంత అరుదుగా కనిపించాయని ఐసీఎంఆర్, జాతీయ రోగ నియంత్రణ కేంద్రం (ఎన్‌సీడీసీ) అధ్యయనాలు వెల్లడించినట్లు వివరించింది. అయితే గత నెలలో హసన్ జిల్లాలో గుండెపోటుతో 20 మందికి పైగా మరణించడం పై సిద్ధరామయ్య ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మరణాలకు కచ్చితమైన కారణాన్ని గుర్తించి పరిష్కారాలు కనుగొనేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పది రోజుల్లో దీనిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. కొవిడ్ వ్యాక్సిన్లను ప్రజలకు తొందరపాటుగా ఆమోదించడం, పంపిణీ చేయడం కూడా మరణాలకు కారణం కావొచ్చని అనుమానం వ్యక్తంచేశారు. ఇటీవల పలు అధ్యయనాలు ఈ వ్యాక్సిన్లతో గుండెపోటు పెరుగుదలకు కారణవ-ువుతాయని వెల్లడించాయన్నారు. దీనిపై కూడా సమగ్ర అధ్యయనం చేయాలని కమిటీని ఆదేశించినట్లు తెలిపారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న కేసీఆర్

**చికిత్స కోసం యశోదాలో చేరిక**



**హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో గురువారం ఆయన సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రిలో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. గత కొద్ది రోజులుగా కెసిఆర్ సీజనల్ జ్వరంతో బాధపడుతున్నట్లు సమాచారం. అయితే గురువారం ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్ నుంచి నగరంలో నందినగర్‌లోని తన నివాసానికి కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యులు చేరుకున్నారు. గత వారం రోజులుగా జలుబు, దగ్గు, తలనొప్పితోపాటు జర్వం ఆయన్ని ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తుంది. జూన్ 11వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్ట్ కమిషన్ ఎదుట కేసీఆర్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో సైతం ఆయన కొంత అస్వస్థతతో ఉన్నారు. ఆ సమయంలో కమిషన్ ఎదుట విచారణ నేపథ్యంలో ఒపెన్ కోర్టుకు తాను రాలేనని.. ఇన్‌సైడ్ విచారణకు హాజరవుతానంటూ కమిషన్‌కు ఆయన స్పష్టం చేశారు. అందుకు కమిషన్ సానుకూలంగా స్పందించింది. దీంతో ఇన్ సైడ్ విచారణకు కేసీఆర్ హాజరైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆయనకు జ్వరం తీవ్రం కావడంతో ఆస్పత్రికి తీసుకుని వచ్చారు. కెసిఆర్ వెంట భార్య శోభారాణి, కెటిఆర్,హరీష్ రావు, మాజీ ఎంపి సంతోష్ కుమార్ ఉన్నారు.

## గోవిందరాజస్వామి ఆలయ సమీపంలో అగ్నిప్రమాదం

**తిరుపతి,జులై 3:** తిరుపతిలోని గోవిందరాజుస్వామి ఆలయం సమీపంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. గురువారం తెల్లవారుజామున గోవిందరాజు స్వామి ఆలయానికి సమీపంలో ఓ దుకాణంలో మంటలు చెలరేగడంతో భక్తులు పరుగులు తీశారు. దుకాణం నుంచి చలువ పందిళ్లకు మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక యంత్రాలు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేశారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. షాపుల్లో ఇత్తడి సామాన్లు, బొమ్మలు దగ్ధంకావడంతో ఆస్తినష్టం జరిగినట్టు సమాచారం.




## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

**శెనార్తి మీడియా, కరీంనగర్:** లయన్ ఇంటర్నేషనల్ 320జీ ఏర్పడి పదవ సంవత్సరం సందర్భంగా జూలై 1 నుండి 7 వరకు జరుపుతున్న వారోత్సవాల భాగంగా, ఇరుకుల్ల ప్రాథమిక పాఠశాలలో 35 మంది విద్యార్థులకు 5,000 విలువగల నోట్ బుక్స్ లయన్స్ క్లబ్ ఆఫ్ మానేరు తరపున అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ముత్యం శంకర్ గౌడ్ ఈ విషయాన్ని తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు అందించిన దాత సుద్దాల రాజు గౌడ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఆర్థికంగా స్థిరపడిన వారు పేద విద్యార్థులకు పుస్తకాలు, బట్టలు, ఇతర నిత్యవసరాల సహాయం అందిస్తూ, సామాజిక బాధ్యతలో భాగం పంచుకోవాలని ఆయన కోరారు. క్లబ్ సెక్రటరీ జిల్లా కృష్ణ, వేముల విష్ణుమూర్తి, పడమటింటి రమేష్, సింహనాతుని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీ రాజరాజేశ్వర లాడ్జి సీజ్

**శెనార్తి మీడియా, వేములవాడ:** వేములవాడ పట్టణంలోని జాతర గ్రౌండ్ సమీపంలోని నందీశ్వర కాంప్లెక్స్ ఎదుట సాయి చరణ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్న శ్రీ రాజరాజేశ్వర ప్రైవేట్ లాడ్జిపై పోలీసులు దాడులు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు ఇది కేంద్రంగా మారిందన్న సమాచారం మేరకు పోలీస్ శాఖ చొరవ తీసుకుంది. తాజాగా తప్పుడు గుర్తింపు పత్రాలతో ఓ మైనర్ బాలికను అక్కడికి తీసుకురావడం, ధ్రువపత్రాల పరిశీలన లేకుండానే గది కేటాయించడం పోలీసుల దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై రుద్రంగి పోలీస్ స్టేషన్లో పోక్సో చట్టం, ఎస్సీ/ఎస్టీ చట్టాల కింద కేసు నమోదు చేశారు.ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లాడ్జిని సీజ్ చేసినట్లు ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి తెలిపారు.

## ముగ్గురికి ఎల్ఓసీ అందజేత

**శెనార్తి మీడియా, వేములవాడ:**

వేములవాడ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స అవసరమైందన్న సమాచారం అందుకున్న వెంటనే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించారు. నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో సంప్రదించి, బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించాలంటూ సూచనలు చేశారు.అదేవిధంగా ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయంగా వెంటనే వైద్య ఖర్చులకు ఎల్ఓసీలను మంజూరు చేయించారు. మొత్తం రూ.6,60,000 విలువ గల మూడు ఎల్ఓసీలు బాధితులకు లభించాయి.కానరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన సూతరి శారదకు రూ.2,60,000, సిరిసిల్ల గణేష్ నగర్ కు చెందిన మధుకు రూ.2,50,000, శాస్త్రినగర్ కు చెందిన పబ్బ రాజేశంకు రూ.1,50,000 మంజూరు చేశారు.తక్షణ సహాయం అందించిన ప్రభుత్వ విప్ కి బాధిత కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు. అత్యవసర సమయంలో అండగా నిలవడమే ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

- కరీంనగర్ సీపీ సీపీ గౌస్ ఆలం



**శెనార్తి మీడియా, కరీంనగర్:**

కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహి రంగప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, బహిరంగ మద్య సేవనంపై ఉన్న నిషేధాజ్ఞలు ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు సీపీ గౌస్ఆలం ప్రకటించారు. దీంతో పాటు డీజేలపై, డ్రోన్ల వినియోగంపై నిషేధాజ్ఞలు ఈ నెల 31వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిం చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సంబంధిత ఏసీపీల నుంచి అనుమతి లేనిదే సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని సూచించారు.